
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
సోమవారం 24 నవంబరు 2025



సుధాకర్‌రెడ్డికి న్యాయం చేస్తా..

వికారాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్ష పదవి ఆశించి భంగపడ్డ పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డిని స్పీకర్ ప్రసాద్‌కుమార్ బుజ్జగించారు. ఆదివారం స్పీకర్ సుధాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లి పలకరించారు. సామాజిక వర్గ సమీకరణల్లో భాగంగానే పదవి తప్పిపోయి ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తం చేశారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరనున్నట్లు తెలిపారు. పదవి చేజారిందని ఆందోళన చెందొద్దన్నారు.

నేడు కొడంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

ఎన్కేపల్లిలో గ్రీన్‌ఫీల్డ్ కిచెన్‌షెడ్ నిర్మాణానికి భూమిపూజ

పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం.. ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్



సీఎం సభా వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కొడంగల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో పర్యటించనున్నారని అధికారులు తెలిపారు. సోమవారం సీఎం హెలీకాప్టర్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు కొడంగల్‌కు చేరుకుంటారు. పట్టణ శివారులోని ఎన్కెపల్లి సమీపంలో నిర్మించనున్న అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ కిచెన్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం నియోకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

ఇప్పటికే హరే రామ, హరే కృష్ణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని 28 వేల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందిస్తున్నారు. అలాగే మధ్యాహ్న భోజనం అందించేందుకు సైతం అక్షయ పాత్ర ముందుకొచ్చింది. దీని కోసం కొడంగల్ పట్టణ శివారులో రెండెకరాలు లీజుకు తీసుకొని గ్రీన్ ఫీల్డ్ కిచెన్ షెడ్ నిర్మించనున్నారు. దీంతో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందనుంది.

ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ పర్యటన నేపథ్యంలో ఆదివారం వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ వివిధ శాఖల అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై ఆరా తీశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నీ వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సీఎం రాకతో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, నారాయణపేట్ కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ మెహ్రామిశ్రా, సీఎంవో అధికారి వాసుదేవ రెడ్డి, ఆర్ అండ్‌బీ, విద్యుత్ శాఖల అధికారులు సభా స్థలాన్ని

మిగతా 8వ పేజీలో...



సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



రుద్రాభిషేకంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

రామ మందిరంలో రుద్రాభిషేకం

» హాజరైన స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ రామ మందిరంలో ఆధ్యాత్మిక సేవా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన రుద్రాభిషేకం కనుల పండువగా సాగింది. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరై దైవ దర్శనం చేసుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పట్టణ ప్రముఖులు, భక్తులు పెద్ద ఎత్తున రుద్రాభిషేక కార్యక్రమానికి తరలివచ్చారు.

అంతారం ఘటనపై రికార్డుల సేకరణ

» 'తాకట్టు.. భూంఫట్' కథనానికి కలెక్టర్ స్పందన

» దర్యాప్తు చేయాలని తహసీల్దార్‌కు ఆదేశం



కులకచర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలంలోని అంతారం ఘటనపై తహసీల్దార్ రికార్డులు సేకరించారు. ఆదివారం 'తాకట్టు భూంఫట్' శీర్షికతో ప్రచురితమైన కలెక్టర్ ప్రతీక్‌జైన్ స్పందించారు. అంతారంలో రైతుల భూములను తాకట్టు పేరుతో సేల్ డీడ్ చేసుకున్న వారి వివరాలు, డాక్యుమెంట్స్, ఎఫ్ఐఆర్ కాపీ, బాధితుల వివరాలు సేకరించి దర్యాప్తు చేసి తనకు పంపించాలని కలెక్టర్ స్థానిక తహసీల్దార్ మనోహరచక్రవర్తికి ఆదేశించారు. దీంతో తహసీల్దార్ అంతారం భూ బాధితులను పిలిపించి వారి వద్ద ఉన్న ఆధారాలు, వివరాలు సేకరించారు. సేకరించిన వివరాలు, బాధితుల అభిప్రాయాలతో నివేదిక రూపొందించి కలెక్టర్‌కు అందించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. మార్టిగేజ్ పేరుతో సేల్ డీడ్ చేసుకొని డబ్బులు ఇవ్వని వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదైనట్లు తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి మృత్యు కుహరంగా మారింది. ఈ రోడ్డు నిత్యం నెత్తురోడుతోంది. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నిత్యం ఏదో ఒకచోట యాక్సిడెంట్లు జరుగుతుండటంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. మీర్జాగూడ స్టేజీ సమీపంలో ఆర్టీసీ బస్సు, టిప్పర్ ప్రమాదం జరిగినప్పటి నుంచి ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే జనం జంకుతున్నారు. రోడ్డు ఇరుకుగా ఉండటం, మలుపుల వద్ద సూచికబోర్డులు లేకపోవడంతో యాక్సిడెంట్లు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిని ఏర్పాటు చేయడంతో పాటు త్వరితగతిన హైవే విస్తరణ పనులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



హైవే టెర్రర్!

హైదరాబాద్ - బీజాపూర్ రహదారిపై ఆగని ప్రమాదాలు



ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొన్న దృశ్యం(ఫైల్)



ప్రమాదంలో నుజ్జయిన కారు

వరుసగా జరుగుతున్న యాక్సిడెంట్లు

ఆర్టీసీ బస్సు, టిప్పర్ ప్రమాదం మరువక ముందే చోటుచేసుకుంటున్న ఘటనలు

ఆ మార్గంలో ప్రయాణమంటే వాహనదారుల బెంబేలు

మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయని అధికారులు

హైవే విస్తరణ పనులు త్వరగా పూర్తిచేయాలని ప్రజల వేడుకోలు

చేవెళ్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నిత్యం ఏదో ఒకచోట యాక్సిడెంట్లు జరుగుతూనే ఉన్నాయి. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ హైవే చాలా ఇరుకుగా ఉండడంతో గడిచిన ఎనిమిదేళ్లలో 393మంది చనిపోయారు. మరో 1008 మంది గాయాలపాలయ్యారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ రోడ్డు వెంబడి మొత్తం 60 మూలమలుపులు ఉన్నాయి. ఇందులో 10 అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. చాలా వరకు మూలమలుపుల వద్దనే

మిగతా 7వ పేజీలో...



ప్రారంభమైన హైదరాబాద్ -బీజాపూర్ రోడ్డు పనులు

రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా చేయాలి



హైదరాబాద్ -బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు ఆలస్యం చేయకుండా వేగవంతంగా పనులు కొనసాగించాలి. రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ దారిలో జరిగిన ప్రమాదాల కారణంగా చాలామంది మృతి చెందగా, మరికొందరు గాయాలపాలయ్యారు. ఇరువైపులా రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి.

- బక్కరెడ్డి యాదిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మల్కాపూర్

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ధారాసింగ్



మంత్రి శ్రీధర్‌బాబుతో డీసీసీ చీఫ్ ధారాసింగ్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబును ఆదివారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ నూతన అధ్యక్షుడు ధారాసింగ్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్త అధ్యక్షుడికి మంత్రి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

వివాహితపై ప్రభుత్వ టీచర్ లైంగిక దాడి!

పరిగి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వివాహితపై ఓ ప్రభుత్వ టీచర్ లైంగిక దాడికి పాల్పడిన ఘటన మండలంలోని గొవిందాపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన 40 ఏళ్ల వివాహిత శనివారం రాత్రి కిరాణా షాపుకు వెళ్లి తిరిగి వస్తుండగా, అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు సంజీవరెడ్డి ఆమె చేయి పట్టుకొని బలవంతం చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది. తనను బలవంతం చేయబోగా తన భర్త చూసి అతడిని పట్టుకొని నిలదీయడంతో అక్కడి నుంచి పారిపోయాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయాన్ని పరిగి ఎస్ఐ మోహనకృష్ణను అడగ్గా వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే తననే కొట్టారని సంజీవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

581 ఇళ్లు.. 9,436 దరఖాస్తులు

డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపునకు చర్యలు

అధికార కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోర్ కమిటీ ఏర్పాటు

తాండూరులో 1,050 ఇళ్లకు నిర్మాణాలు పూర్తయినవి 581

వార్డుకు పది మంది చొప్పున ఎంపిక చేయాలని నిర్ణయం

36 వార్డుల నుంచి వచ్చిన దరఖాస్తులు 9,436



తాండూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తాండూరు - హైదరాబాద్ రోడులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించేందుకు అర్హుల గుర్తింపునకు అధికార కాంగ్రెస్ పార్టీ కోర్ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ సభ్యులు ఇప్పటికే వార్డుల వారీగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. తాండూరుకు 1,050 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు కాగా, వాటిలో 581 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. 2023లో డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించేందుకు అధికారులు 36 వార్డులకు ఆరు కేంద్రాలను ఏర్పాటు చేసి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇళ్ల నిర్మాణం పూర్తయిన 581 ఇళకు మొత్తం 9,436 దరఖాస్తులు వచ్చాయి. వాటిని కేటాయించాలని అప్పటి ప్రభుత్వం ప్రయత్నాలు చేయగా అప్పటికే శాసన సభ ఎన్నికలు రావడంతో ఇళ్ల కేటాయింపు వాయిదా ప్రక్రియ పడింది.

పంపిణీ తర్వాతే మౌలిక సదుపాయాలు

శాసన సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ప్రభుత్వం మారడంతో డబుల్ బెడ్రూం ఇళ్ల దరఖాస్తులను మూలనపడేశారు. పూర్తయిన ఇళ్ల వద్ద ఇంకా తాగు నీటి వసతి రోడ్లు, మురుగు కాల్వలు ఏర్పాటు చేయాల్సి ఉంది. గతంలో తాండూరులో నిర్వహించిన ఓ కార్యక్రమానికి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరై డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద మౌలిక సదుపాయల కల్పనకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించిన తర్వాత మౌలిక సదుపాయల కల్పనకు నిధులు కేటాయించి పనులు చేయించాలని నిర్ణయించారు. ఈ మేరకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఒక కోర్ కమిటీని ఏర్పాటు చేశారు. వార్డుల వారీగా సమస్యను గుర్తించడంతోపాటు డబుల్ బెడ్రూం, ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను గుర్తించే బాధ్యతను కూడా కోర్ కమిటీకి అప్పగించారు. మరోవైపు అధికారులు కూడా అర్హులను గుర్తించే ప్రక్రియను చేపట్టారు. వార్డుకు పది చొప్పున డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని నిర్ణయించారు.

కలెక్టరేట్‌లో సత్య సాయి శతజయంతి వేడుకలు

మేడ్చల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ కలెక్టరేట్‌లో ఆదివారం సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి డీఆర్ఓ హరిప్రియ పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు దామోదర్‌రెడ్డి, సిబ్బంది, కేలో ఇండియా సైకిల్ సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి
ద్వారా మిమ్ములను అభిమానించే వారికి, శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి
ADVERTISEMENTS
జన్మదిన వేడుకలు
విదేశీయాన శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
వివాహ శుభాకాంక్షలు
స్వదేశాగమన శుభాకాంక్షలు
మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి.
ప్రతి ప్రకటనపై GST 5% వర్తిస్తుంది.
రంగారెడ్డి జిల్లా : 99854 10120
వికారాబాద్ జిల్లా : 91776 43744
మేడ్చల్ జిల్లా : 99854 10906



సందడిగా సదర్

దుద్యాల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలేడ్‌లో గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సదర్ సందడిగా సాగింది. దున్నపోతుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్య యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు పుర్ర రాఘవేందర్‌యాదవ్ హాజరయ్యారు. మూగజీవాలప్రాధాన్యం తెలిపేందుకే సదర్ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

బాలింతకు తప్పని నడకయాతన



చీకటిలో కాలినడకన వెళ్తున్న బాలింత

దుద్యాల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పరిహారం పేరుతో ఓ వ్యక్తి రోడ్డుకు అడ్డంగా తవ్విన గుంతతో బాలింత పడరాని పాట్లు పడింది. చేసేదేమి లేక రెండు కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. కొడంగల్ మండలం చిట్లపల్లికి చెందిన కవితబాయి వారం క్రితం తాండూరు ప్రభుత్వాస్పత్రిలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఆదివారం రాత్రి డిచ్చార్జి అయ్యి ఆటోలో తల్లిగారి ఊరైన పీర్లగడ్డ తండాకు వెళ్తుండగా చిలుముల్‌మైలారం చెట్టుపల్లి తండా మధ్యలో రోడ్డుకు అడ్డంగా గోతి తవ్వి ఉండగా అక్కడే గంటసేపు ఎదురుచూసింది. ఊరికి వెళ్లే మార్గం లేక తప్పని పరిస్థితిలో కుటుంబ సభ్యులతో కాలినడకన వెళ్లింది. చిలుముల్‌మైలారం నుంచి చెట్టుపల్లి తండా మీదుగా పీర్లగడ్డ తండాకు దారి ఉంది. దీనికి ఇటీవలే బీటీ రోడ్డు మంజూరైంది. అయితే తన భూమిలో నుంచి రోడ్డు వెళ్తుందని, తనకు పరిహారం చెల్లించేవరకు పనులు చేపట్టొద్దని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రోడ్డుకు అడ్డంగా గోతి తవ్వడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇది తెల్వక వచ్చిన బాలింతకు ఇబ్బందులు ఎదురయ్యాయి. గోతి తవ్విన వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకోవాలని తండావాసులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రేమున్న చోటే పరమాత్ముడు ..

● హైకోర్టు న్యాయవాది సాయిప్రసాద్



సత్యసాయి శత జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న తెలంగాణ హైకోర్టు న్యాయవాది సాయిప్రసాద్

వికారాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):ప్రేమ ఉన్న చోటే పరమాత్ముడు ఉంటాడని హైకోర్టు న్యాయవాది సాయిప్రసాద్ అన్నారు. ఆదివారం శ్రీ సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాలను వికారాబాద్‌లోని జ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. బాబా ఒక వ్యక్తి కాదు.. ఆయన ఒక వ్యవస్థ అన్నారు. అందుకే సత్యసాయి సేవా సంస్థలు ప్రపంచంలోని అనేక దేశాల్లో వెలిశాయని కొనియాడారు. మానవ వికాసానికి శాస్త్రవిజ్ఞానం, దైవ విశ్వాసం రెండూ ముఖ్యమే అన్నారు. విశిష్ట అతిథి చంద్రశేఖర్ పట్నాయక్ మాట్లాడుతూ.. నిష్కామ కర్మతో చేసిన ఏ మంచి పనైనా సేవే అని పేర్కొన్నారు. పరమ సత్యాన్ని ఎవరో బోధించరనీ, నీకు నీవే తెలుసుకోవాలని తెలిపారు. వ్యవస్థాపక అధ్యక్షుడు ద్వారకానాథ్ మాట్లాడుతూ.. సత్యం ధర్మం శాంతి ప్రేమ అహింస అనే విలువలను బోధిస్తూ కోట్లాది మంది భక్తుల గుండెల్లో సత్యసాయి కొలువయ్యారని తెలిపారు. ప్రచారార్భాటానికి చేసే సేవ కీర్తి, ప్రతిష్ఠలు పెంచుతుందేమో కానీ.. అది సమాజానికి మంచి సందేశాన్ని, స్ఫూర్తిని ఇవ్వలేదన్నారు. అనంతరం మండల జిల్లాస్థాయిలో వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శాలువాలు కప్పి మెమొంటోలు, ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. సాయంకాలం దీపోత్సవం, స్వామి వారి డోలారోహణం, జవహర్ బాల్‌భవన్ ఇన్‌చార్జి పర్యవేక్షకురాలు అనురాధ ఆధ్వర్యంలో పది మంది బాలికలు కూచిపూడి, భరతనాట్యం నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనర్ సత్యనారాయణగౌడ్, ఆధ్యాత్మిక సమన్వయకర్త బందప్పగౌడ్, జిల్లా యూత్ కోఆర్డినేటర్ బసవరాజ్, పాపయ్య, సతీష్‌చంద్ర, మల్లయ్య, కపిల్ దేవ్, గోపాల్‌రెడ్డి, విఠోబా, వర్ధిని పాల్గొన్నారు.

చేవెళ్లలో ఘనంగా సత్యసాయి బాబా జయంతి వేడుకలు

చేవెళ్ల: సత్యసాయి బాబా వందో జయంతి సందర్భంగా ఆదివారం చేవెళ్లలోని సత్యసాయి మందిరంలో బాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి వరకు సత్య సాయి బాబా మందిరంలో సత్యసాయి జన్మదిన కేక్ కట్ చేశారు. దీంతో ప్రత్యేక భజనలు, కీర్తనలు ఆలపించారు. సాయంత్రం చేవెళ్లలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై స్వామి వారి పల్లకి సేవ నిర్వహించారు. దారి పొడవునా పచ్చటి తోరణాలు, సత్యసాయి ఫ్లెక్సీలు విద్యుత్ లైట్లతో అలంకరించారు. సాయిరాం నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రధాన కన్వీనర్ అయ్యావారి గోపాలచారి, కన్వీనర్ రామగౌడ్, మాజీ కన్వీనర్ మధుసూదన్, సభ్యులు మోహన్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, వెంకట్‌స్వామి, విజయ్, బుచ్చిరాములు, సతీష్, వెంకటేశ్, భాస్కర్, శంకర్, మద్దెల విఠల్, పెంటారెడ్డి, మహిళలు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



చేవెళ్లలో సత్య సాయిబాబా పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

తిరిగొచ్చిన ఉమ్రా యాత్రికులు

శంషాబాద్ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలోని మక్కా, మదీనాలను దర్శించుకున్న యాత్రీకులు ఆదివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో కుటుంబ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికారు. సౌదీలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై వారు స్పందించారు. బస్సు ప్రమాదంలో మృతిచెందిన వారు యాత్రలో తమతో మాట్లాడినట్లు తెలిపారు. మాట్లాడిన కాసేపటికే వారు ముందు బస్సులో ఉండగా ప్రమాదం జరిగిందన్నారు. మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం ప్రసాదించాని కోరుకున్నారు. పుట్టిన ప్రతీ ఒక్కరికి మరణం తప్పదని, ఉమ్రా యాత్రలో చనిపోతే స్వర్గానికి వెళ్లినట్టు భావిస్తామన్నారు. 15 రోజుల క్రితం అందరం ఒకే విమానంలో వెళ్లి తిరిగి వారు లేకుండానే రావడం బాధాకరమన్నారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఉమ్రా యాత్రికులు

తండాలో తాగునీటికి తండ్లాట

కులకచర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలంలోని హన్మనాయక్ తండాలో తాగునీటి ఎద్దడి నెలకొంది. వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదు. దీంతో తండా ప్రజలు నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. నీటి కోసం సమీప వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. పొలం గట్లపై నుంచి నీరు తీసుకువస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని తండా వాసులు కోరుతున్నారు.



హన్మనాయక్ తండాలో బోరు నీటి కోసం పొలాలకు వెళ్తున్న స్థానికులు

జాతీయ స్థాయి క్రీడలకు విద్యార్థి ఎంపిక



జాతీయ జట్టుకు ఎంపికైన నరేశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న స్థానికులు

కులకచర్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అండర్-19 జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలకు మండలానికి చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. ఇప్పయిపల్లికి చెందిన మొగులయ్య కుమారుడు నరేశ్‌కుమార్ పరిగి గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. మధ్యప్రదేశ్‌లో ఈ నెల 17 నుంచి 20వరకు జరిగిన వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఆదివారం నరేశ్‌కుమార్‌ను కులకచర్లలో సన్మానించారు. కార్యక్రమంలో ఆనంద్‌కుమార్, వెంకట్రాములు, రవికుమార్, వెంకట్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లకు పోరాడుదాం



బీసీ సంఘం సమావేశంలో నాయకుల అభివాదం

దోమ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బీసీలకు జనాభా ప్రాతిపదికన 42శాతం రిజర్వేషన్లకు పార్టీలకతీతంగా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని బీసీ సంఘం నాయకులన్నారు. ఆదివారం దోమలోని టీటీడీ కల్యాణ మండపంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఉద్యోగ, రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో జనాభాలో రిజర్వేషన్ లేకపోవడంతో వెనకబాటుకు గురవుతున్నామన్నారు. ఇప్పటికైనా బీసీలు మేల్కొని ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, జగన్‌మోహన్, రామకృష్ణ, రామస్వామి, శాంతకుమార్, కేశవులు, గోవర్ధన్, వెంకటయ్య పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


పరిగి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. కేంద్రం తెచ్చిన చట్టాలకు వ్యతిరేకంగా ఆదివారం పరిగిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీడీఎస్, ఎన్‌హెచ్‌ఎం, ఎండీఎంఎస్ లాంటి కేంద్ర ప్రభుత్వ పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కార్మికుల కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత గురించి సీఐటీయూ పోరాటం చేస్తుంటే బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న జిల్లా కేంద్రంలో చేపట్టే నిరసన కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికసంఘాల నాయకులు బాలయ్య, బాబయ్య, శంకరయ్య, మల్లేశ్, రాజు, లలిత, నర్సమ్మ పాల్గొన్నారు.



పరిగిలో నిరసన తెలుపుతున్న కార్మికులు

















పరిగిలో మూడు ఓపెన్ జిమ్‌లు

- తిరుమల వెంచర్, మినీ స్టేడియంలో జిమ్‌ల నిర్మాణం
- రూ.30లక్షలు వెచ్చించనున్న మునిసిపల్ శాఖ

పురుషులు, మహిళలకు వేర్వేరుగా ఏర్పాటు


తిరుమల వెంచర్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయనున్న పార్కు స్థలం

పరిగి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):పరిగిలో ఓపెన్ జిమ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. పరిగి పురపాలక సంఘం జిమ్ కేంద్రాల ఏర్పాటుకు సన్నహాలు చేస్తోంది. ఇందుకు రూ.30లక్షల వరకు ఖర్చు చేయనున్నారు. ఈ జిమ్ సెంటర్ల ఏర్పాటుకు ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపన కూడా చేశారు. త్వరలోనే జిమ్‌ల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ మొదటివారం నాటికి అందుబాటులో తెచ్చేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ప్రజారోగ్యం కోసం వ్యాయామ కేంద్రాల ఏర్పాటు

పట్టణ వాకర్స్‌కు, వ్యాయామం చేసేవారి కల నేరవేర బోతోంది. పరిగిలో మూడు చోట్ల జిమ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఒక్కో సెంటర్‌కు రూ.10లక్షల చొప్పున వెచ్చిస్తారు. మినీ స్టేడియంలో ఒకటి, తిరుమల వెంచర్ పార్కు జాగాలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. తిరుమల వెంచర్ పార్కులో మహిళలు, పిల్లలకు, పురుషులకు వేర్వేరుగా జిమ్ములను ఏర్పాటు చేస్తారు. మహిళల జిమ్ సెంటర్‌లో ఏర్పాటు చేయనున్న పరికారాల్లో ఆరు పిల్లలకు, ఎనిమిది మహిళలకు, పురుషుల సెంటర్‌లో 14 రకాల పరికరాలను అందుబాటులో ఉంచుతారు. మినీ స్టేడియంలోనూ 14 రకాల జిమ్ పరికరాలను ఏర్పాటు చేస్తారు. జిమ్‌లలో ప్రత్యేక కార్పెట్ పరుస్తారు. లైటింగ్ సిస్టమ్ పెడతారు. తిరుమల వెంచర్‌లో ఏర్పాటయ్యే జిమ్‌లో నాలుగు వైపులా నాలుగు, మధ్యలో ఒకటి చొప్పున టవర్ లైటింగ్ సిస్టమ్‌ను అమర్చుతారు. ఈ జిమ్ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియకు ఇప్పటికే శ్రీకారం చుట్టారు. త్వరలోనే పనులు ప్రారభిస్తారు. వాకర్లు, ప్రైవేట్ జిమ్ సెంటర్లకు వెళ్లే వారంతా ఈ కేంద్రాలను ఉపయోగించుకునేలా ఏర్పాట్లు చేస్తారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా రోడ్లపై వాకింగ్ నివారణకు ఈ కేంద్రాల్లో చుట్టూ వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేస్తారు.

డిసెంబరులో అందుబాటులోకి తెస్తాం



రూ.30లక్షల వ్యయంతో పరిగిలో మూడు చోట్ల జిమ్ సెంటర్ల ఏర్పాటు చేస్తాం. తిరుమల వెంచర్‌లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా, మినీ స్టేడియం మైదానంలో ఒకటి పురుషుల కోసం జిమ్ము ఏర్పాటు చేస్తున్నాం. ఈ సెంటర్లలో ప్రత్యేకంగా లైటింగ్ సిస్టమ్ పెడతాం. ఈ జిమ్‌లు డిసెంబరు మొదటివారంలోగా ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

- వెంకటయ్య, కమిషనర్, పరిగి మునిసిపాలిటీ


ఇందిరమ్మ లబ్ధిదారులతో ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

చేవెళ్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్విరామంగా పనిచేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధి ఊరెళ్లలో ఏర్పుల ఉష-అశోక్ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే యాదయ్య హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పాలిట కల్పవృక్షం అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో ప్యాక్స్ ఛైర్మన్లు దేవరవెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్‌ఛైర్మన్ రాములు, సీనియర్ నాయకులు సున్నపు వసంతం, కుంచం శివకుమార్‌గుప్తా, మండల అధ్యక్షుడు వీరందేర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ప్రభాకర్, జహంగీర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దేవర సమతారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు భూ నిర్వాసితులతో ఎమ్మెల్యే సమావేశం

కడ్తాల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులతో సోమవారం సమావేశం కానున్నట్లు నాయకులు, అధికారులు తెలిపారు. కడ్తాల మండలం ఎక్వాయిపల్లి గ్రామంలో నిర్వహించే సమావేశానికి నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి హాజరవుతారని వారు పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే కడ్తాల మండలం ఎక్వాయిపల్లి, ముద్విన్, మర్రిపల్లి, అన్మాసపల్లి, ఆమనగల్లు మండల కోనాపూర్ గ్రామ రైతులు పాల్గొనాలని వారు కోరారు. సమావేశంలో పాల్గొని తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించాలని సూచించారు.

రఘువీరారెడ్డి అనుచరుల నారాజ్...

- డీసీసీ చీఫ్ పదవి రాకపోవడంతో నైరాశ్యం
- పార్టీకి ఆయన చేసిన సేవలను నాయకత్వం గుర్తిస్తుందనే నమ్మకం


రఘువీరారెడ్డి

ధారూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధి అంతారం గ్రామానికి చెందిన పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారెడ్డికి డీసీసీ పదవొస్తుందని ఆయన అనుచరులు, కాంగ్రెస్ శ్రేణులు ఆశించారు. కానీ పార్టీ అధిష్ఠానం రఘువీరారెడ్డికి పదవి ఇవ్వకపోవటంతో వారంతా నారాజయ్యారు. ఈ అంశంపై పార్టీలో, ఆయన అనుచరుల్లో చర్చ కొనసాగుతోంది. గతంలో అధిష్ఠాన పరిశీలకుల వద్ద ధారూరు, వికారాబాద్, పరిగి, తాండూర్, కొడంగల్ ప్రాంత నాయకులు, ముఖ్య కార్యకర్తలు రఘువీరారెడ్డికి డీసీసీ చీఫ్ పదవి ఇవ్వాలని తమ అభిమతాన్ని వ్యక్తం చేశారు. స్థానికంగా పార్టీ బలోపేతానికి రఘువీరారెడ్డి కష్టపడ్డారని, ప్రతిపక్షంలో పదేళ్లు ఉండి, బీఆర్ఎస్ పాలనలో ఎన్ని కేసులు పెట్టినా బెదరకుండా పార్టీని నడిపించారని నాయకులు, క్రియాశీల కార్యకర్తలు గుర్తుచేస్తున్నారు. పార్టీ పరిశీలకుల అభిప్రాయ సేకరణతో డీసీసీ పదవి కచ్చితంగా రఘువీరారెడ్డికే వస్తుందనే ధీమాగా ఉన్నామని, తీరా ధారాసింగ్‌ను కొత్త డీసీసీ చీఫ్‌గా ప్రకటించడంతో మండల నాయకులంతా డీలా పడిపోయారు. రఘువీరా డీసీసీ చీఫ్ అయితే మరింత ప్రభావం చూపి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు దోహదం చేసేదని అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉంటే తనకు డీసీసీ చీఫ్ పోస్టు రానందున పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరెడ్డి కూడా నిరాశగానే ఉన్నట్లు ఆయన సన్నిహితుల ద్వారా తెలుస్తోంది. కష్టకాలంలో పార్టీకి రఘువీరారెడ్డి చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర నాయకత్వం ఆయనకు భవిష్యత్తులో పార్టీ లేదా ప్రభుత్వ పరంగా పదవులు అప్పగిస్తుందనే నమ్మకాన్ని అనుచరులు వ్యక్తం చేస్తున్నారు.

హైవే టెర్రర్!

(ఐదో పేజీ తరువాయి)

ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. చేవెళ్ల, మొయినాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 1117 రోడ్డు ప్రమాదాలు జరుగగా.. 393 మంది మృతి చెందారు. 1008 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. తల్లిదండ్రులు మృతి చెందటంతో పిల్లలు అనాథలుగా మారారు. ఇప్పటికైనా ఈ హైవేపై 46 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తిచేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ఆర్టీసీ బస్సు, టిప్పర్ ప్రమాదం మరువక ముందే ...

చేవెళ్ల మండలంలోని మీర్జాగూడ స్టేజీ సమీపంలో ఈనెల 3వ తేదీన ఆర్టీసీ బస్సు, టిప్పర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో 19 మంది మృతి చెందగా, మరో 34 మంది గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటన మరువక ముందే వరుసగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఈ నెల 20వ తేదీన ఖానాపూర్ స్టేజీవద్ద రోడ్డు పనుల కోసం అంతారం గ్రామం నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్ లారీ వేగంగా వచ్చి అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వడ్డె శ్రీరామ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈనెల 21వ తేదీన మొయినాబాద్ మండలంలోని కనకమామిడి వద్ద రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. చేవెళ్ల మండలంలోని దామరిగిద్ద స్టేజీ వద్ద నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను చూసి ప్రజలు, వాహనాదారులు భయాందోళనలు చెందుతున్నారు.

కొనసాగుతున్న రోడ్డు పనులు

హైదరాబాద్ -బీజాపూర్ జాతీయ దారదారి 163, ఔటర్ రింగ్‌రోడ్డు పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ వరకు 46 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు కొద్ది రోజులుగా ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నిత్యం ఈ హైవేపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ గా తీసుకున్నారు. విస్తరణ పనులు వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత నేషనల్ హైవే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

బైపాస్‌ల నిర్మాణం

హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి 46 కిలో మీటర్ల పరిధిలో 18 అండర్ పాస్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. చేవెళ్ల, మొయినాబాద్ ప్రాంతాల్లో బైపాస్ పనులు కొనసాగుతున్నాయి. మొయినాబాద్ వద్ద 4.35 కిలోమీటర్ల మేర, చేవెళ్ల వద్ద 6.35 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్లను నిర్మిస్తున్నారు. బైపాస్ మధ్యలో అండర్‌పాస్‌లు నిర్మిస్తున్నారు. నాలుగు లేన్ల రహదారిగా విస్తరణలో భాగంగా పూడూరు మండలం చిట్టంపల్లి వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులు నిర్ణయించారు.

విరిగిన బొల్లార్డ్స్

ఈ హైవేపై మొయినాబాద్ నుంచి మన్నెగూడ వరకు డివైడర్ లేకపోవడంతో ట్రాఫిక్ పోలీస్‌లు బొల్లార్డ్స్ ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరగకుండా రోడ్డు మధ్యలో వీటిని ఏర్పాటు చేశారు. ఇవి ఎక్కడికక్కడ విరిగిపోయాయి. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి.. ముందు వాహనాన్ని ఓవర్ టెక్ చేస్తూ వెళ్తున్న క్రమంలో బొల్లార్డ్స్‌ను ఢీకొట్టడంతో అవి పాడయ్యాయి.

ప్రత్యేక చర్యలు అవసరం

హైదరాబాద్ -బీజాపూర్ హైవేపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీస్ శాఖ ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉంది. రోడ్డు ఇరుకుగా ఉండడం, వాహనాలు వేగంగా రావడంతోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు పేర్కొంటున్నారు. అయితే మూలమలుపుల వద్ద ప్రత్యేక సూచిక బోర్డులు, బొల్లార్డ్స్ ఏర్పాటు చేస్తే వాహనాల వేగం నియంత్రించే అవకాశం ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంతో ఎన్‌హెచ్ అధికారులు గుంతలున్న చోట బీటీ వేసి చేతులు దులుపుకున్నారు. అయితే ప్రమాదాల నివారణ కోసం సూచిక బోర్డులు, రాత్రి పూట కనిపించేలా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయడం మరిచిపోయారని విమర్శలు వస్తున్నాయి.


ఇటీవల ఖానాపూర్ స్టేజి వద్ద చెట్టుకు ఢీకొన్న టిప్పర్(ఫైల్)

తొలగిన అడ్డంకులు

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్‌హెచ్ఏఐ అధికారుల సమక్షంలో సేవ్‌బనియన్స్ సంస్థకు చెందిన పర్యావరణ వేత్తలతో పలు దఫాల్లో చర్చలు జరిపారు. కాగా, 954 చెట్లు కాపాడుతామని, 150 చెట్లు మాత్రమే రీలొకేట్ చేస్తామని అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వడంతో కేసు విత్‌డ్రా చేసుకునేందుకు అంగీకరించారు. ఈ మేరకు అలైన్‌మెంట్‌లో మార్పులకు సంబంధించి పూర్తి రిపోర్టును ఎన్జీటీకి సమర్పించడంతో అక్టోబరు 31వ తేదీన చెన్నయ్‌లోని గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టులో రోడ్డు విస్తరణ పనులు కొనసాగించవచ్చని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ కేసును విత్‌డ్రా చేసుకున్న పర్యావరణ వేత్తలను సీఎం రేవంత్‌రెడ్డి ఘనంగా సన్మానించారు.


గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు విత్‌డ్రా చేసుకున్న తర్వాత సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన పర్యావరణవేత్తలు



వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ధ్వంసం అయిన కార్లు(ఫైల్)

హైదరాబాద్ - బీజాపూర్ రోడ్డుపై జరిగిన ప్రమాదాల వివరాలు

చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో				మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో			
సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు	సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2018	66	25	81	2018	64	13	64
2019	62	27	57	2019	97	16	97
2020	82	61	79	2020	67	08	67
2021	65	32	46	2021	56	23	34
2022	76	21	65	2022	59	18	39
2023	71	23	71	2023	76	34	78
2024	79	41	87	2024	49	14	65
2025	81	19	78	2025	67	32	65
మొత్తం	582	249	564	మొత్తం	535	144	444

రాత్రిపూట బావి పూడ్చివేత పనులు


రోడ్డుకు అడ్డంగా కొమ్మలు పెట్టి రాళ్ల టిప్పర్ అన్‌లోడ్ చేస్తున్నారిలా...


మర్రిపల్లిగూడలో రాత్రిపూట బండరాళ్లతో బావి పూడ్చుతున్న రియల్ వ్యాపారులు

- బండరాళ్లను డంప్ చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు
- రోడ్డును బ్లాక్ చేస్తూ పనులు కొనసాగిస్తున్న వైనం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మర్రిపల్లిగూడలోని ఓ వ్యవసాయ బావిని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పెద్ద రాళ్లతో పూడ్చుతున్నారు. రాత్రిపూట టిప్పర్లలో రాళ్లు తెచ్చి పోస్తున్నారు. ఉదయం పూట ఎన్ఎఫ్‌సీనగర్ సమీప గుట్టను పగులగొట్టి రాత్రి సమయంలో రాళ్లను టిప్పర్లల్లో లోడ్ చేసుకుంటూ బావిలో పోస్తున్నారు. ఈ వ్యవసాయ బావి ఘట్‌కేసర్-ఎదులాబాద్ రోడ్డు పక్కనే ఉండటంతో ప్రమాదాలు జరుగకూడదని గతంలో అధికారులు బావికి రక్షణగా పునాదిగోడ నిర్మించారు. రియల్ వ్యాపారులు రక్షణగోడను కూల్చి రాళ్లతో నింపేస్తున్నారు. ఈ వ్యవహారమంతా అధికారులు విధుల్లో ఉండని సెలవుదినాల్లో చేపడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా నలుగురైదుగురు కర్రలతో నిలబడి వాహనాలను ఆపి బండరాళ్లను బావి డంప్ చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి లేకుండానే రాళ్లు కొట్టుకొచ్చి సాగుబావిని పూడ్చుతున్నారు. అలాగే రాత్రి పూట రోడ్డు వెంట వెళ్తున్న వాహనాలను ఆపుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సేవాభావంతో వైద్యం చేయాలి



మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు సేవాభావంతో వైద్యం చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్‌లోని శివగార్డెన్‌లో ఆదివారం అబాబీల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యం చేయించుకున్న వారికి మందులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... నేడు వైద్యాన్ని కూడా కొందరు డాక్టర్లు వ్యాపారంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరం ఉన్నా లేకున్నా వైద్య పరీక్షలు చేయిస్తున్నారని, అధిక మోతాదుల్లో మందులు రాస్తూ, బిల్లులను పెంచుతున్నారని అన్నారు. దేవుడి తరువాత దేవుడిగా భావించే వైద్యులు ఆర్థిక దోపిడీ చేయకుండా సేవా భావంతో వైద్యం చేస్తూ, మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన సూచించారు. అబాబీల్ ఫౌండేషన్ వైద్య శిబిరం నిర్వహించి, మందులను పంపిణీ చేయడం అభినందనీయమని శంకర్ తెలిపారు. అనంతరం పటేల్ రోడ్డుకు చెందిన పి.అండాలు వైద్యం కోసం మంజూరైన రూ.2.5లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీని అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు హఫీజ్, అన్వర్, ఇర్ఫాన్, సాదిక్, నవాజ్, ఖాలేద్‌ఖాన్, అజర్, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ బాబర్, కాంగ్రెస్ నాయకులు అగ్గనూరి బస్వం, కె.చెన్నయ్య, జమృత్‌ఖాన్, వాసు, మనీశ్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఇరిగేషన్ భవనం

- ఆమనగల్లులో సర్కారు ఆస్తి నిర్లక్ష్యం పాలు
- వినియోగంలోకి తేవాలంటున్న స్థానికులు
- వాడకం లేక స్థలం అన్యాక్రాంతమయ్యే ఆస్కారం



ఆమనగల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆస్తులు వినియోగంలో లేక భవనాలు శిథిలం అవుతున్నాయి. 30ఏళ్ల కింద ఆమనగల్లులో హైదరాబాద్ రోడ్డులో విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన ఇరిగేషన్ శాఖ కార్యాలయాన్ని నిర్మించారు. మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు, సిబ్బంది కొన్నాళ్లపాటు కార్యకలాపాలు సాగించారు. భవనాన్ని అనుసరించి శ్మశానవాటిక ఉండడంతో దాన్ని ఖాళీ చేశారు. నిరుపయోగంగా మారిన ఈ భవనం తలుపులు, కిటికీలు, టైల్స్ ఇతర వస్తువులు దుండగులు ఎత్తుకపోయారు. పదేళ్ల క్రితం రూ.2లక్షలు వెచ్చించి మరమ్మతులు చేశారు. అయినా వినియోగంలో లేక పశువుల ఆవాసంగా మారింది. పొదలతో నిండింది. కోట్ల రూపాయల విలువ చేసే సర్కారు స్థలం అన్యాక్రాంతమయ్యే పరిస్థితి ఉంది. పూర్వపు పంచాయతీ సమితి ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లో ఎక్కడా నీటి పారుదల శాఖకు కార్యాలయం లేదు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఎక్కడుంటారో, ఏం పని చేస్తారో ఎవరికీ తెలియదు. ఈ నేపథ్యంలో నాలుగు మండలాలకు అనువుగా ఉండే ఈ కార్యాలయాన్ని వినియోగంలోకి తెస్తే చెరువులు, కుంటలు, ఇతర చిన్ననీటి వనరుల పర్యవేక్షణకు అధికారులు అందుబాటులో ఉండి రైతులకు, ప్రజలకు సేవలందించే అవకాశం ఉంటుంది. ఇక్కడ ఇరిగేషన్ ఏఈ, డీఈఈ కార్యాలయాల ఏర్పాటుకు ఏళ్లుగా డిమాండ్ ఉంది. అయితే ఆ దిశగా ఎవరూ చొరవ చూపడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని రైతులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

కార్యాలయం లేక ఇబ్బంది



ఆమనగల్లులో ఇరిగేషన్ శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి. ప్రత్యేకంగా భవనం లేక ఆ శాఖ అధికారులు మండల పరిషత్‌కు అప్పుడప్పుడు వచ్చిపోతున్నారు. నిరుపయోగంగా ఉన్న నీటిపారుదల శాఖ భవనానికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చి అధికారులను రైతులకు అందుబాటులో ఉంచాలి. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

- కండె హరిప్రసాద్, మాజీ జడ్పీటీసీ, ఆమనగల్లు

ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతాం



ఆమనగల్లు ఇరిగేషన్ శాఖ కార్యాలయ భవనాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు కృషిచేస్తాం. ఇప్పటికే ఇరిగేషన్ శాఖ డివిజన్ కార్యాలయ ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయాం. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవి లు కూడా కార్యాలయం గురించి ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. భవనాన్ని ఆధునీకరించేలా ప్రభుత్వంతో మాట్లాడతాం.

- మండ్లీ రాములు, మాజీ ఎంపీటీసీ, ఆమనగల్లు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మేడ్చల్ టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు మండలం మొల్లగూడకు చెందిన గిరిధర్(24) ఆదివారం సాయంత్రం మేడ్చల్ మండలం అక్బర్‌పేటలో బంధువుల విందు కార్యక్రమంలో పాల్గొన్నాడు. తన ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వెళ్తుండగా పూడూరు శివారులో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొన్నాడు. దీంతో గిరిధర్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కోట్‌పల్లి: చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు



పరిగి: సయ్యద్‌పల్లి గ్రామంలో మహిళలకు చీరలు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ పరశురాంరెడ్డి



తాండూరు రూరల్: కొత్లాపూర్‌లో చీరలు పంపిణీ చేస్తున్న డీసీసీబీ వైస్‌చైర్మన్ రవీందర్‌గౌడ్



ధారూరు: ధారూరులో మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఐకేపీ వీవోఏలు



పూడూరు: ఎన్కెపల్లిలో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోట్‌పల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు నర్సిములు అన్నారు. మండలంలోని బార్వాద్ గ్రామంలో ఆదివారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచందర్ రెడ్డి(టిల్లు), రాచిరెడ్డి, మైపాల్‌రెడ్డి, సంజీవయ్యగౌడ్, రవి, సునీత, వీవోఏలు మల్లేశం, నాగిరెడ్డి, మహిళా సంఘం అధ్యక్షుడు పాల్గొన్నారు.

దోమ: మండలంలోని బ్రహ్మణపల్లి, శివారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఇందిరా మహిళాశక్తి ఆధ్వర్యంలో మహిళలకు కాంగ్రెస్ నాయకులు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు నసీమ, వీవోఏలు జ్యోతి, ఆరీఫా, సీసీ అంజమ్మ, ఇందిరమ్మ కమిటీసభ్యులు అంతిరెడ్డి, రాము, హైమద్, మాజీ సర్పంచ్ సురేశ్, కాంగ్రెస్ నాయకులు బషీర్, రమేశ్, మహేశ్, శేఖర్, కృష్ణ, ప్రభు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పూడూరు: ఎన్కెపల్లి గ్రామంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఎన్కెపల్లిలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, నాయకులు అనంతయ్య, సత్తయ్య, ప్రవీణ్, సువాని తదితరులు పాల్గొని చీరలను అందజేశారు.

ధారూరు: మండలంలోని కేరెల్లి, ధారూరు, గడ్డమీది గంగారం, మైలారం గ్రామాల్లో ఆదివారం ఇందిరా మహిళాశక్తి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో మహిళలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐకేపీ వీవోఏలు చీరలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్నారెడ్డి, బల్వంత్‌రెడ్డి, వెంకటయ్య, రవీందర్, సిద్ధూ, వీవోఏలు సుజాత, శివలీల పాల్గొన్నారు.

పరిగి: సయ్యద్‌పల్లిలో పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి ఆదివారం మహిళలకు ఇందిరా మహిళాశక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్లు తావుర్యానాయక్, నర్సిరెడ్డి, ఇందిరమ్మ కమిటి సభ్యులు పి.సుమలతగణేశ్, అనుసూయ, అన్వర్, టి.నర్సింహులు, పి.యాదయ్య, వెంకట్‌రెడ్డి, సత్యం, రామస్వామి, చంద్రశేఖర్, ఎల్లప్ప పాల్గొన్నారు.

తాండూరు రూరల్: మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీసీబీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వైస్‌చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్ అన్నారు. మండలంలోని కొత్లాపూర్ గ్రామంలో ఆదివారం మాజీ సర్పంచ్ బుడ్డెలి సాయిలు ఆధ్వర్యంలో మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల్, పండరి, ఎంపీడీవో విశ్వప్రసాద్, ఏపీఎం బాలయ్య, పాల్గొన్నారు.

క్రైం కార్నర్

స్నేహితుడితో గొడవ.. యువకుడి ఆత్మహత్య

యాలాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడితో గొడవపడి ఓ యువకుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన యాలాల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. యాలాల ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అగ్గనూరు గ్రామానికి చెందిన సమీర్‌బీన్(20), అరుణ్‌గౌడ్ స్నేహితులు. సమీర్‌బీన్ ఇంటర్ వరకు చదివి మానేసి ఊర్లోనే ఉంటున్నాడు. శనివారం సాయంత్రం అరుణ్ గౌడ్, సమీర్ బీన్ ఇద్దరూ కలిసి గ్రామ సమీపంలోని నాగులకుంట చెరువు దగ్గరకు వెళ్లారు. ఏదో విషయంలో అక్కడ ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో అరుణ్‌గౌడ్ సమీర్ బీన్‌ను చేతులుకట్టేసి బైక్ తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సమీర్ బీన్ శనివారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఉరేసుకుని ఆత్మహ్యత్యకు పాల్పడ్డాడని ఎస్‌ఐ తెలిపారు. ఆదివారం మృతుడి తల్లి గంజి బీపాషా పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు అరుణ్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

రైలుకింద పడి కూలీ మృతి

ధారూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ధారూరు-గోధుమగూడ రైల్వేస్టేషన్ల మధ్య రైలుకింద పడి కూలీ మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పెద్దేముల్ మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన కూలీ బాలకృష్ణ(20) ధారూరు నుంచి వికారాబాద్ వైపు వెళ్తున్న రైలు కిందపడి మృతిచెందాడు. అయితే అతడు ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ప్రమాదవశాత్తు రైల్లో నుంచి పడి మృతిచెందాడా? అనేది తెలియడంలేదని వికారాబాద్ రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

'భగీరథ' నీరువృథా!



పైపులైన్ పగిలిపోవడంతో వృథాగా పోతున్న నీరు

దుద్యాల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ ట్యాంకు నుంచి వచ్చే పైపులైన్ పగలడంతో తాగునీరు వృథా అవుతోంది. మండలంలోని పోలెపల్లి గ్రామంలోని తంగేళ్లగడ్డ నుంచి హనుమాన్ దేవాలయం వరకు సీసీరోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. అందులో భాగంగా రోడ్డును తవ్వారు. దీంతో మిషన్ భగీరథ, ట్యాంకు నుంచి పైపు అక్కడక్కడ పగిలిపోవడంతో తాగునీరు వృథాగా రోడ్డుపై పారుతోంది. దీంతో గుంతలు ఏర్పడి రోడ్డంతా బురదమయంగా మారి వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ధారాసింగ్ నియామకం పట్ల హర్షం



పెద్దేముల్‌లో కాంగ్రెస్ నాయకులు సంబురాలు

పెద్దేముల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ధారాసింగ్ జాదవ్‌ను నియమించడం పట్ల పెద్దేముల్ మండలంలో కాంగ్రెస్ పార్టీ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. పెద్దేముల్ మండలం పెద్దేముల్ తండాకు చెందిన ధారాసింగ్ జాదవ్ వార్డు సభ్యుడి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడుగా ఎంపికయ్యారు. మండలానికి చెందిన ధారాసింగ్ జాదవ్ ప్రజాసమస్యలను తమ సమస్యలుగా గుర్తించి వాటి పరిష్కారానికి ప్రయత్నం చేస్తారని, అలాంటి వ్యక్తికి పార్టీలో సముచిత గౌరవం లభించిందని మండల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మండల కేంద్రంలో ఆదివారం బాణాసంచా పేల్చి వారి అభిమానాన్ని చాటుకున్నారు. మిఠాయిలు పంచుకుని సంబురాలు చేసుకున్నారు. పార్టీ కోసం ఎల్లవేళలా కష్టపడే వ్యక్తికి తప్పకుండా సముచితస్థానం లభిస్తుందన్నారు. అందుకు ధారాసింగ్ జాదవ్ ఉదాహరణగా నిలుస్తారని పార్టీ నాయకులు, కార్యకర్తలు పేర్కొంటున్నారు.

వజ్రేశ్‌యాదవ్‌ను కలిసిన కాంగ్రెస్ శ్రేణులు



కీసర: వజ్రేశ్‌యాదవ్‌తో కీసర నాయకులు

కీసర, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ను కీసర కాంగ్రెస్ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కీసర మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, కీసర గ్రామశాఖ అధ్యక్షుడు జూపల్లి రవీందర్, కీసరగుట్ట ట్రస్ట్ బోర్డు సభ్యుడు రెడ్డబోయిన ప్రవీణ్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడు ముద్దం వెంకటేశ్, యువజన కాంగ్రెస్ కీసర మండల నాయకులు ఎస్.వెంకటాచారి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



మంబాపూర్‌లో వరికొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్

పెద్దేముల్, నవంబర్ 23(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలని ఏఎంసీ చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో ఆదివారం వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతుధరను ఇస్తూ ధాన్యం కొనుగోలు చేస్తుందని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించడం వల్ల వారికి లాభాలు సమకూరుతాయని చెప్పారు. ఎలాంటి రుసుములు లేకుండా రైతులు విక్రయించిన ధాన్యానికి రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం గ్రేడ్-1 రకం వరిధాన్యానికి క్వింటాళుకు రూ 2389 చెల్లిస్తుందని చెప్పారు. సన్నాలు ఉంటే వాటికి అదనంగా మరో రూ 500 బోనస్‌గా చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు గోపాల్, డీసీఎంఎస్ మేనేజర్ సలాం పాష, మాజీ కోఆప్షన్ సభ్యులు నసీర్, నాయకులు లాల్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వాహెద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి



చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దోమ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేదలకు సీఎం సహాయనిధి అండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన పెంటయ్యకు ఆదివారం రూ.20,500, మేకల భీమమ్మ భర్త అనంతయ్యకు రూ.60వేలు, ఈడిగి నాగలక్ష్మికి రూ.29వేలు, షాహిద్‌పాషకు రూ.79వేలు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశన్నగౌడ్, సాయిలు, రవిగౌడ్, వెంకటయ్య, రాములు, బాలాజీ, ఆనంద్‌గౌడ్, నర్సిములు, ఎర్ర శ్రీను, రాములు, శ్రీను పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారం



ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, నాయకులు

బొంరాస్‌పేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే పేదల సొంతింటి కల సాకారమైందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. నాగిరెడ్డిపల్లిలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గ్రామానికి 97ఇళ్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, డైరెక్టర్ మల్లేశ్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, ప్రవీణ్, మహేందర్, నర్సిములు, రాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

కొడంగల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలు ఇతర ప్రాంతాలకు తరలింపును నిరసిస్తూ సోమవారం కొడంగల్ స్వచ్ఛంద బంద్‌కు పిలుపునిచ్చినట్లు కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు సురేశ్‌కుమార్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, రమేశ్‌బాబు, ఎస్ఎం.గౌసన్, రవినాయక్, భీమరాజు అన్నారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. విద్యాసంస్థల తరలింపునకు నిరసనగా సోమవారం చేపట్టిన కొడంగల్ బంద్‌లో ప్రతీఒక్కరు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు కరాటే గ్రేడింగ్ బెల్ట్ టెస్టు



విద్యార్థినుల కరాటే టెస్టును పరిశీలిస్తున్న ఎస్ఐ రాఘవేందర్

ధారూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ధారూరులో కరాటే గ్రేడింగ్ బెల్ట్ టెస్టును నిర్వహించారు. కరాటే టెస్టులో ధారూరులోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కరాటే బెల్ట్‌టెస్టును ఎస్ఐ రాఘవేందర్ ప్రారంభించారు. ఈ టెస్టులో పాల్గొన్న విద్యార్థులకు ఎస్ఐ రెడ్, ఎల్లో బెల్ట్‌లు, గ్రేడింగ్ సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రమౌళి, పాఠశాల కరస్పాండెంట్ మధు, కరాటే మాస్టర్లు చంద్రశేఖర్ గౌడ్, నజీముద్దీన్, ఫిరోజ్ పాల్గొన్నారు.

సీఎం పర్యటనను జయప్రదం చేయాలి

దౌల్తాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లో సోమవారం(నేడు) సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను జయప్రదం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్ పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. మధ్యాహ్నం 2.30గంటలకు కొడంగల్ పట్టణ శివారులోని ఎన్కెపల్లి గేటు వద్ద అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనపథకం కోసం కిచెన్ షెడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు?

తాండూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సర్పంచుల రిజర్వేషన్ వివరాలు అనాధికారికంగా ఖరారయ్యాయి. తాండూరు నియోజకవర్గంలో నాలుగు మండలాలకు గానూ రిజర్వేషన్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

తాండూరు మండలంలో..

సిరిగిరిపేట్, మల్కాపూర్, ఉద్దండాపూర్, వీరారెడ్డిపల్లి, కరన్‌కోట్, చంద్రవంచ, ఖాంజాపూర్, రాంపూర్ మీది తండాలు జనరల్ కాగా, వీర్‌శెట్టిపల్లి, కోటబాస్పల్లి, కొత్లాపూర్ కుర్దు, బెల్కటూర్, గోనూర్, పర్వతాపూర్‌లు జనరల్ మహిళగా కేటాయించారు. అల్లాపూర్, చిట్టిఘనాపూర్, చెనెగేష్‌పూర్‌లు బీసీలకు కేటాయించగా సంగెం కలాన్, బిజ్వార్, చింతామణిపట్నం, గౌతాపూర్ లు బీసీ మహిళకు కేటాయించారు. సంకీరెడ్డిపల్లి, అంతారం తండా ఎస్టీలకు, గుండ్లమడుగు తండా ఎస్టీ మహిళలకు కేటాయించారు. ఎల్మకన్నె, ఐనెల్లి, ఓగిపూర్‌లు ఎస్సీలకు కేటాయించగా చెంగోల్, మిట్టబాస్పల్లి, అంతారంలు ఎస్సీ మహిళలకు కేటాయించారు.

యాలాలలో..

సంగెంకుర్దు, గంగాసాగర్, బండమీదిపల్లి, రాస్నం, తిమ్మాయిపల్లి, పేర్కంపల్లి, అన్నాసాగర్, కోకట్, ముకుందాపూర్‌లు జనరల్‌కు కేటాయించగా, అక్కంపల్లి, కమల్‌పూర్, అడల్‌పూర్, దేవ నూర్, గోరేపల్లి, దౌలాపూర్, చెన్నారం, లక్ష్మీనారాయణపూర్ జనరల్ మహిళకు కేటాయించారు. పగిడిపల్లి, జుంటుపల్లి, విశ్వనాథ్‌పూర్‌లు బీసీలకు కేటాయించగా, అగ్గనూర్, ముద్దాయిపేట్, పగిడ్యాల్, బీసీ మహిళలకు కేటాయించారు. జక్కేపల్లి, నాగసమందర్, రాగాపూర్ ఎస్సీలకు కేటాయించారు. కిష్టాపూర్, అచ్యుతాపూర్ ఎస్సీ మహిళలకే కేటాయించగా, బాణాపూర్, దేష్మతండా, సంగాయిగుట్ట తండా, సంగాయిపల్లి తండా ఎస్టీలకే కేటాయించగా, బషీర్‌మియ తండా, పేర్కంపల్లి తండా, రేలిగడ్డ తండా ఎస్టీ మహిళలకు కేటాయించారు.

పెద్దేముల్..

రుక్మాపూర్, బండమీదిపల్లి, ఆత్కూర్, తట్టేపల్లి, నాగులపల్లి, హన్మాపూర్, మంసాన్‌పల్లి జనరల్‌కు కేటాయించగా, బండపల్లి, గాజీపూర్, మంబాపూర్, అడ్కిచర్ల, ఖానాపూర్, కొండాపూర్, పాషపూర్ జనరల్ మహిళకు కేటాయించారు. జనగాం, ఇందూర్, గోట్లపల్లి బీసీలకు, గోపాల్‌పూర్, రుద్రాం, మారేపల్లి బీసీ మహిళలకు కేటాయించారు. రేగొండి, బుద్దారం, పెద్దేముల్ ఎస్సీలకు కేటాయించగా, దుగ్గాపూర్, కందనెల్లి, తింసాన్‌పల్లి, ఎస్సీ మహిళలకు కేటాయించారు. గిర్మాపూర్, జయరామ్ తండా, బాయిమీది తండా, కందనెల్లి తండా, ఓమ్లనాయక్ తండా, సిద్ధన్నమడుగు తండా ఎస్టీలకు కేటాయించగా, చైతన్య నగర్, ఎర్రగడ్డ తండా, జయరామ్ తండా, మదనంతపూర్, మారేపల్లి తండా, ఊరేంటి తండా ఎస్టీ మహిళలకు కేటాయించారు.

బషీరాబాద్‌లో..

అల్లాపూర్ (బి), మర్పల్లి, కొర్విచేడ్, పర్వత్‌పల్లి, మైల్వార్, నీళ్లపల్లి జనరల్ కే టాయించగా, కాశీంపూర్, ఎక్మాయి, మంతన్‌గౌడ్ తండా, కంసాన్‌పల్లి (బి), గంగ్వార్, దామర్‌చేడ్ జనరల్ మహిళకు కేటాయించారు. ఇందర్‌చేడ్, గోట్టిగకలాన్, రెడ్డిఘనాపూర్, బషీరాబాద్ బీసీలకు కేటాయించగా, మంతట్టి, మసాన్ పల్లి, గోటిగకుర్దు బీసీ మహిళలకు కేటాయించారు. నవాంద్గి, మల్కన్‌గిరి, జీవన్గి ఎస్సీలకు కేటాయించగా, నవల్గా, బాహదూర్‌పూర్ ఎస్సీ మహిళలకు కేటాయించారు.మంతన్‌గౌడ్, జలాల్‌పూర్, బాహదూర్‌పూర్ తండా, బొజ్యా నాయక్ తండా, ఇస్మాయిల్‌పూర్, కుప్పన్‌కోట్ ఎస్టీలకు కేటాయించగా, కొత్లాపూర్, బాబునాయక్ తండా, హంక్యనాయక్ తండా, నంద్యా నాయక్ తండా, పర్స్య నాయక్ తండా, వాల్యా నాయక్ తండా ఎస్టీ మహిళలకు కేటాయించారు.

ఘనంగా సత్యసాయి బాబా జయంతి



సత్యసాయిబాబా జయంతిలో మాజీ ఎమ్మెల్యే, నాయకులు

కొడంగల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీపుట్టపర్తి సాయిబాబా శత జయంతిని ఆదివారం కొడంగల్ పట్టణంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్‌పర్సన్ వాణిశ్రీయాదవ్ నివాసంలో ఘనంగా నిర్వహించారు. సత్యసాయి జన్మదిన సందర్భంగా ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ, రాహుల్‌యాదవ్, కోట్ల యాదగిరి, శ్రీనివాస్‌గౌడ్, మైపాల్, సురేశ్, రవిగౌడ్, రవీందర్‌గౌడ్, ఆశప్ప, శ్రీనివాస్‌నాయక్, బండిగోపాల్, చంద్రప్ప పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



వార్షికోత్సవంలో ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యప్రదర్శన

కీసర, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత చదువులు చదివి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మాజీ కలెక్టర్ దినకర్‌బాబు అన్నారు. నాగారం మున్సిపల్ పరిధి రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ 9వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ కలెక్టర్ దినకర్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడుతాయన్నారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల నాటిక, గీతాలాపనలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ మురళీముకుంద్, ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, హెచ్ఎం సుశీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

నేడు కొడంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

(ఐదో పేజీ తరువాయి)

పరిశీలించారు. వైద్యసదుపాయాలు, తాగునీరు, బారికేడ్లు, మొబైల్ టాయిలెట్స్, వీవీపీ పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ.103 కోట్లతో పనులు ప్రారంభం

కొడంగల్ నియోజకవర్గంలో 28 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.5.83 కోట్లు, 23 పాఠశాలల్లో అదనపు తరగతి గదులకు రూ.5.01 కోట్లు, 10 పంచాయతీ భవనాలకు రూ.3 కోట్లు, బంజార భవన్‌కు ప్రహరీ, డైనింగ్ హాల్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కోసం రూ.3.65 కోట్లు, ఎక్సైజ్ స్టేషన్ రూ.కోటి, ఫైర్ స్టేషన్‌కు రూ.1.30 కోట్లు, కొడంగల్‌లో స్విమ్మింగ్ పూల్‌కు రూ.1.40 కోట్లు, కమ్యూనిటీ హాల్, కిచెన్ షెడ్డు, ప్రహరీ నిర్మాణానికి రూ.4.91 కోట్లు, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల కోసం రూ.4.45 కోట్లు, పలు పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణం, గ్రంథాలయ భవనాలకు రూ.2.95 కోట్లు, కొడంగల్‌లో రోడ్డు విస్తరణ పనులకు రూ.60 కోట్లు, రూ.5 కోట్లతో ఆర్అండ్‌బీ అతిథి గృహం, కోస్గి నూతన మార్కెట్ యార్డు నిర్మాణానికి రూ.4.50 కోట్లు, తదితర అభివృద్ధి పనులకు కలిపి రూ.103 కోట్లు కేటాయించారు. వీటిని సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

ఎడ్యుకేషన్ హబ్ స్థల పరిశీలన



ఎడ్యుకేషన్ హబ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ ఇంజనీర్ విజయభాస్కర్‌రెడ్డి

దుద్యాల్: కొడంగల్ పర్యటనలో భాగంగా సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి మండలంలోని పోలెపల్లి, హకీంపేట్ గ్రామాల శివారులో ఎడ్యుకేషన్ హబ్‌కు ఏరియల్ సర్వే చేసే అవకాశం ఉన్నట్లు సూపరింటెండెంట్ ఇంజనీర్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం ఎడ్యుకేషనల్ హబ్ స్థలాన్ని పరిశీలించి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేటాయించిన భూముల్లో హద్దులు గుర్తించి, వివిధ రంగుల జెండాలతో కూడిన స్తంభాలను హద్దుల వెంబడి ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ పోలెపల్లి రాజయ్య, ఏఈలు విజయభాస్కర్‌రెడ్డి, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

తపస్ తాండూరు నియోజకవర్గ నూతన కార్యవర్గం



తాండూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాండూరు నియోజకవర్గ తపస్ నూతన కార్యవర్గాన్ని శనివారం సిద్ధార్థ జూనియర్ కళాశాలలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారికి విశ్రాంత ఉపాధ్యాయులు హన్మప్ప వ్యవహరించారు. యాలాల మండల అధ్యక్ష ప్రధానకార్యదర్శిగా శ్రీనివాస్, శ్రీశైలం, బషీరాబాద్ అధ్యక్షకార్యదర్శిగా గాజుల వీరేశం, రవీందర్‌గౌడ్, పెద్దేముల్ మండల అధ్యక్ష, కార్యదర్శిగా జంగం సంతోష్ కుమార్, పట్లోళ్ల అనిల్, తాండూరు మండల అధ్యక్ష కార్యదర్శిగా ఎం.రవి, వినోద్‌కుమార్ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కోశాధికారి కరణం లక్ష్మీకాంతరావు పాల్గొని ప్రసంగిస్తూ విద్యాపరంగా సమస్యలతో పాటు విద్యార్థుల నైతిక విలువలు పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బూస రాములు, ఆనందం, సిద్దార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, మీడియా కన్వీనర్ బస్వరాజ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



బసయ్య(ఫైల్)

యాలాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాస్నం మాజీ సర్పంచ్ అబ్బని బసయ్య(56) గుండెపోటుతో మృతి చెందారు. ఈ ఘటన శనివారం రాత్రి జరిగింది. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాస్నం మాజీ సర్పంచ్ అబ్బని బసయ్యకు నాలుగు రోజుల కిందట గుండెపోటు వచ్చింది. దీంతోట వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బసయ్య శనివారం రాత్రి మృతిచెందాడని గ్రామస్తులు తెలిపారు. బసయ్య సామాజిక కార్యకర్తగా, బీసీ నాయకుడిగా మత్స్య సహకార సంఘం సభ్యుడిగా ఉంటూ పలు సేవాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. బసయ్య అంత్యక్రియలు ఆదివారం ఆయన స్వగ్రామమైన గంగసాగర్‌లో నిర్వహించారు.

క్రీడలు శారీరక దారుఢ్యానికి దోహదం



క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్సై వసంత్ జాదవ్

దోమ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక, శారీరక దారుఢ్యానికి ఎంతో దోహదం చేస్తాయని ఎస్సై వసంత్‌జాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, కరాటే మాస్టర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

బీసీ జేఏసీ అడహక్ కమిటీ పరిగి కన్వీనర్‌గా సదానందం

పరిగి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీసీ జేఏసీ పరిగి నియోజకవర్గం అడహక్ కమిటీ కన్వీనర్‌గా పి.సదానందం, వైస్‌చైర్మన్‌గా న్యాయవాది ఆనంద్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా చెర్క సత్తయ్య, వార్ల ఆంజనేయులు, ప్రధానకార్యదర్శులు జి.వెంకట్‌రాంలు, న్యాయవాది జింకల యాదయ్య, ముఖ్య సలహాదారులుగా డాక్టర్ బి.జగన్మోహన్ ముదిరాజ్, సీహెచ్ బాలముకుందం, నర్సింహులుయాదవ్, పాండు రంగాచారి, సంయుక్త కార్యదర్శులు ఆర్‌పీ ఏజెంట్ ఆంజనేయులు, జి.శ్రీనివాస్, వెంకటేశ్‌గౌడ్, లక్ష్మణ్, కార్యదర్శులుగా లింగమయ్య, యాదయ్యసాగర్, చందుకు, వెంకటయ్య, శ్రీశైలం, కోశాధికారిగా భాస్కర్ యాదయ్య, ప్రచారకార్యదర్శి గోవర్ధన్‌లు ఎన్నికైనట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కె.హన్మంత్‌ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ పశువులు ఎవరివో?



నాగసమందర్‌లో తిరుగుతున్న గేదెలు

ధారూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగసమందర్‌లో మూడు రోజులుగా రెండు గేదెలు, ఒక దున్నపోతు, గేదె దూడ సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇవి ఎక్కడి నుంచి వచ్చాయో తెలియడం లేదని, వీటి గురించి గ్రామంలోకి ఎవరినీ ఆరాతీసినా తమకు తెలియదంటున్నారని తెలిపారు. సంబంధిత యజమానులు గుర్తించి తీసుకెళ్లాలని గ్రామస్తులు కోరారు.